# తప్పెవరిది

"మహేన్"

సావిత్రికీ ప్రకాశానికీ మామూలు విషయాలలో చిన్న చిన్న పేచీలు వచ్చినా రాకపోయినా, ఒక్క విషయంలో మాత్రం వీళ్లి పోట్లాటలు హద్దు మీరి పోయేవి.

నిజానికి ప్రకాశం చక్కని కథలు రాయగలిగినా, అతనికున్న డిఫెక్టల్లా ఏమిటంటే, రాసినకథను మళ్ళీ ఓమారు చదువుకొని తప్పులేవైనా వుంటే దిద్ది సరిచేసుకోరటమన్నా, రఫ్ కాపీని ఫేర్ చేయటమన్నా అతనికి మహాచెడ్డ తలనొప్పి.

అంచేత ఒకొక్కరోజు, తాటి కాయలంతేసి అక్షరాలతో తను గజిబిజిగా రాసి పారేసిన కాగితాల కట్టలనంతా చేతబట్టి వంటగదిలోకెళ్ళి, భార్య ఎదుట వినమ్రుడై నిలచి "భామామణీ!" అనిసంబోధించేవాడు.

తలపైకెత్తి, భర్త చేతిలోని కాగితాలను చూస్తూనే సర్వమూ ఊహించి "భామా లేదూ - గీమా లేదు......నాకిది బొత్తిగా ఇష్టంలేదు" అని విసుక్కునేది సావిత్రి.

"ఏదీ?...నేను భామామణీ యని పిలవటమా?"

"మీకూ మీ మాటలకే చెల్లు. వీటిని కూడా మీ కథల్లోకి ఎక్కించండి. నలుగురూ నేర్చుకొని మీలాగే వాళ్ళ పెళ్ళాలను వేపుకు తింటారు."


అద్భుతిమువంటి

## అనంగ ప్రభాయాకుతి

సుందరమైన యౌవ్వనానికి ప్రకాశవంతమైన తేజస్సుకు ఉత్తమమైనది. ధాతువును గట్టిపరచి వృద్ధిచేయును బలహీనతచెందిన నరములకు శక్తినీ, పటుత్వమును చేకూర్చును సుఖమైన దాంపత్యజీవితమునకు ఉత్తరవాదముగలసంజీవి
30 మాత్రలు రు. 10, 15 మాత్రలు రు. 5.

మదన మంజరి ఫార్మసీ

184, చైనాబజారు రోడ్డు, మద్రాసు.
బెజవాడ-శ్రీనివాస మెడికల్‌స్టోర్సు పార్కురోడ్డు
రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్‌రోడ్డు
నెల్లూరు:- ఆర్యన్ ఫార్మసీ-ట్రంకురోడ్డు
ఇతర కేంద్రాల్లో ఏజెంట్లు కావాలి


"పోనీ...దానికైనా నువ్వు ఫేర్ కాపీ చేసివ్వండే...అదికాదే - ఇలా చూడూ! ఈ కథను ఇలా చిత్తుగా పంపిస్తే ఆ పత్రికలవాళ్ళు దీని మొహమైనా చూస్తారు టే? ఇంతవరకూ నేనెన్ని కథలు రాసివుంటాను. అన్నీ చూడూ - అటకమీదపడి మూలుగుతున్నాయ్. ఒక్కటైనా నువ్వు ఫేర్ చేసిచ్చి పుణ్యం కట్టుకున్నావా! ఇదో సావిత్రీ! ఈ కథను గనుక నువ్వు సుభ్రంగా కాపీ చేసిచ్చావంటే, ఈకథవల్ల వచ్చిన పారితోషికంతో నీకే ఏమైనా తీసిస్తాను."

"మీరు తీసివ్వక పోయినా సరే. మీరు ఇంకేపని చెప్పినా తలతో చేసి పెడతా కానీ - ఇది మాత్రం నావల్ల అయ్యేపని కాదండీ."

"అలాగంటే ఎలాగే?"—మరి చదువుకున్న నిన్ను పెళ్ళిచేసుకుంది ఎందుకు?- ఏడ్వటానికా?" అని కాస్త ఎర్రమొహం చేసుకునేవాడు ప్రకాశం.

"మీరు ఏమైనా అనండి. ఇరవైనాల్గు గంటలూ ఇంటిపనితోనే చచ్చి సగమై పోతూంటే, ఉండేపని చాలక ఇదొహటా? మొన్న మా మేనకోడలు ఇటొచ్చి వెళ్లినప్పుడు నన్ను చూసి ఏమనందో తెలుసా? ముక్కుమీద వేలేసుకుని 'ఇదేమిటే-ఇలా చిక్కి శల్యమై పోయినావూ' అంది. కావలిస్తే మీరే చూడండి. మొన్ననగా తీసిచ్చారు కదా ఈగాజుల్ని. చూసుకోండి అప్పుడే ఎంత వదులైపోయాయో" అని ముక్కు ఎగరవేసేది సావిత్రి.

ఆమె మొండిపట్టుదలకు, అమాంతంగా మీదపడి నమలకుండా మింగేద్దామా అన్నంత కోపం వచ్చేసేది ప్రకాశానికి. కానీ ఆ కోపంలో ఏమనటానికీ సమయానికి తోచక "హుఁ,నువ్వింతే లేవే...ఇంతకీ నాఖర్మ" అని చప్పగా అనేసి జారుకునేవాడు. అతను వంటగదిదాటి హాలులోకి అడుగెట్టేలోగా, కొన్ని గ్లాసులు విరిగిన చప్పుళ్లూ, పాత్రలను బలంగా నేలకు గుద్దిన సద్దులూ వినిపించేవి.

* * *

భార్య కాన్పుకు పుట్టింటికి వెళ్లి ఆరు నెలలైంది. ప్రసవించింది కూడానూ. ఆడబిడ్డ.

ఇక్కడ ప్రకాశానికి పొద్దుపోవటం లేదు. ఆవేళ ఆదివారం. ఆఫీసు లేదు. ఏం చేయటానికీ తోచక, అటకమీద పడి మూల్గుతూన్న కొన్ని కాగితాలకట్టలను తీసి ముందు వడేసుకొని కూర్చుని దుమ్ము దులిపాడు. అతనికళ్లు చెదిరిపోయినై. దాదాపు చెమ్మగిల్లేంత పనయింది. 'ఒకటా రెండా...ఎన్ని కథలు! ఎన్ని కథలు!! ఇవన్నీ ఈపాటికి అచ్చయివుంటే ఎంత బావుండేది'ప్పో'అని నిట్టూర్చాడు ప్రకాశం.

కడుపునిండా గాలి పీల్చుకొని, వాటిల్లోంచి ఓకథను చేతికెత్తుకొని చూశాడు. "తప్పెవరిది"అన్న కథానిక అది. నవ్వుకున్నాడు ప్రకాశం. తనకు అలాంటిస్థితిలో ఆపేరుగల కథ దొరకటం ఓ తమాషాకదూ!

"తప్పెవరిది" నోట ఓమారు ఉచ్చరించి తన్మయుడయ్యాడు ప్రకాశం. ఆ కథను ఇప్పటికి తాను మరిచిపోయినా, దానిని మాత్రం ఎన్నడో చాలా బాగా రాశానని అతనికి పూర్తిగా నమ్మకముంది. ఆపుడియు లోనే ఆకథను ఓనాలుగయిదుసార్లు చదువుకొని తెగమురిసిపోవటమే అందుకుసాక్షి.

నోరుతెరిచి పెద్దగా ఆవులించాడు ప్రకాశం. తను రాసిన రఫ్ నించి ఫేర్ చేయటం తన జీవితంలో ఇదే ప్రప్రథమం.

కాగితం మీద నించి కలాన్ని ఎత్తకుండా ఒకే పట్టులో రాసుకుపోతూన్నాడు ప్రకాశం. ఆ కథానికను ఫేర్ చేయటానికి ఏ సుమూహూర్తాన ఉపక్రమించాడో ఏమోకానీ, ఆపని ముగించి, ఆ కథను పోస్టుచేసి వచ్చేంతవరకూ ఇంకో పని జోలికిపోలేదు ప్రకాశం.

* * *

ఓ రోజున ఆఫీసునించి వచ్చి, వీధి తలుపు తెరిచేసరికి "జ్యోతిప్రభ" పత్రిక నేలమీదపడి వుండింది. ఆత్రంతో ఆ పత్రికను చేతికెత్తుకొని తిరగేశాడు ప్రకాశం. తన కథ ప్రచురింపబడివుంది! నిలుచున్న పళంగానే ఆ కథను చదువసాగాడు ప్రకాశం. కథ బాగా సాగి, ఒకచోట మాంచి రసవత్తర ఘట్టంలో హఠాత్తుగా ఆగిపోయి వుంది. 'సశేషం - తరువాయి వచ్చే సంచికలో' అని [illegible] పేర్కొనబడివుంది.

మరుక్షణంనించీ తర్వాతి సంచిక ఎప్పుడెప్పుడు వస్తుందా, అందులో తన కథ యొక్క తర్వాత భాగం ఎప్పుడెప్పుడు ప్రచురింపబడుతుందా, అని ఇప్పట్నించే ఎదురు చూడటానికి మొదలెట్టాడు.

వారముయింది...పదిరోజులైంది. ప్రకాశానికి తదుపరి "జ్యోతి ప్రభ" సంచిక రానేలేదు. పోస్టులో ఆలస్యమేమైనా జరిగి వుంటుందేమోనని బజారుకు వెళ్ళి

అక్కడ బుక్‌స్టాల్ వద్ద చూస్తే, "జ్యోతి ప్రభ" సంచికలు బారులు తీరిన కొంగల్లా తాడుకు వ్రేలాడుతూన్నాయ్. ఓ కాపీ కొనుక్కొని గబగబా పేజీలు తిరగేశాడు ప్రకాశం. అతనికథ ఎక్కడాకనిపించలేదు.

స్తంభితుడై, మళ్ళీ మొదటినుంచి ఒక్కొక్క పేజీగా తిరగవేస్తూ చూశాడు. చివరికి ఆఖరిపేజీలో ఈ ప్రకటన కనిపించింది.

"పోయిన సంచికలో, మాకు శ్రీ వి. పి. ప్రకాశంగారు పంపించిన 'తప్పెవరిది' అన్న కథానికను ప్రచురించితిమి. అదే కథ, ఆ పేరుతోనే, పోయినవారం 'సాహితీ' పత్రికలో "రేవతి" అను పెన్‌నేమ్ పేరిట ప్రచురింప బడినట్లుగా మాకు తెలియవచ్చినది. అంచేత ఆ కథ, సశేషాన్ని ఈ సంచికలో మేము ప్రచురించుటలేదు. ఇందులకు మేము అమిత విచారిస్తూన్నాము. ఇకనెప్పుడూ శ్రీ వి. పి. ప్రకాశంగారు ఇలాటి గ్రంథచౌర్యానికి పూనుకోనరని ఆశిస్తూన్నాం—సం॥

దాదాపు గుండె ఆగినంత పనైంది ప్రకాశానికి. ఆ ప్రకటన చదువుతూన్నంతసేపూ అతని కాళ్ళక్రింద భూమి దద్దరిల్లిపోయినట్లయింది. నిలువునా కంపించిపోయాడు.

నిజానికి తాను స్వయంగా రాసిన కథే అది. కాని ఈ ప్రకటన చూడబోతే విచిత్రంగావుంది. ప్రకాశం, ఇదేదో మిస్టరీనో మోసమో జరిగుంటుందనుకొని, కోపంతో నేరుగా చకచకా నడిచివెళ్ళిపోయాడు ఇంటికి.

ఆ 'సాహితీ' పత్రికా సంపాదకుడికి జాబురాసి, "రేవతి" విలాసం తెలుసుకొని ఈగూడు పుఠాణీ ఎలా జరిగిందో ఆచోకీ తీయాలని సంకల్పించుకొన్నాడు.

కాగితం కలం అలా చేతికెత్తుకున్నాడో లేదో, పోస్టుమాన్‌వచ్చి ఒక కవరని ఇచ్చేసిపోయాడు. ప్రకాశం ఉత్తరాన్ని చేతికెత్తుకున్నాడు.

బెంగుళూరు
28-1-1953.

సావిత్రి చేయు అనేక నమస్కారములు.

ఇక్కడ అందరూ క్షేమం. మీ క్షేమ సమాచారాలకు బదులు రాసేది. మీవద్దనుంచి ఉత్తరాలువచ్చి చాలారోజులైంది. కారణం తెలియటంలేదు. అమ్మాయి ఆరోగ్యంగా వుంది. అచ్చం మీ పోలికే.

దాదాపు ఇరవైరోజుల క్రితం, మీకు ఒక కార్డురాసి, దానిని పోస్టులో పడేసిరమ్మని మా తమ్ముడు రామూ చేతికిచ్చి పంపితే, ఆ వెధవ పోస్టుచేయలేదు. నిన్ననే ఎందుకో పాడి పెట్టె తెరిచిచూస్తే అందులో ఆకార్డు కనిపించింది ఆ కార్డులో మన అమ్మాయికి, ఈనెల 6వ తేదీనాడు 'రేవతి' అని నామకరణం చేసితిని. ఈపేరు మీకు నచ్చినదనుకుంటాను.

ఎన్నడో అక్కడున్నప్పుడు మీరు రాసివుంచిన, 'తప్పెవరిది' అన్న కథను నీట్‌గా రాసివుంచాను. ఆ కథ ఎలాగో పొరబాటున నా సామానులతో పాటు ఇక్కడికి వచ్చి పడివుండింది. మన అమ్మాయికి నామకరణం చేసినరోజే ఆ కథ నాకు కనిపించింది. అంచేత మన అమ్మాయి 'రేవతి' పేరిట, ఈ ఊరిలోవుండే 'సాహితీ' పత్రికకు పంపిమని మా అన్నయ్యను కోరాను. వెంటనే ఆ సాహితీపత్రికలో ప్రకటిబడింది. వాళ్ళు ఇక్కడ మాకొక కా పంపించారు. మీరు కూడా ఎక్కడై ఆ సంచికను సంపాదించిపెట్టుకో

"అంతే తర్వాత చదవలేకపోయా ప్రకాశం. అతని చేతిలోని ఉత్తరం అ తెలియకుండానే గాలికి అలా . పోయింది. అతను అలాగే కొయ్యబ శూన్యం వంకచూస్తూ వుండిపోయాడు.

